## ముగ్గుల పోటీలు



మాదాపూర్, జనవరి 10: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం చందానగర్‌లోని లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.

**ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**



శేరిలింగంపల్లి, జనవరి 10: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా, రామస్వామి యాదవ్

## ఆశావర్కర్ల వేతనాలపై అసెంబ్లీలో చర్చించాలి




ఆశావర్కర్లకు జీతాల పెంపుపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఇంటి వద్ద సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌తో కలిసి ఆశా వర్కర్లు బైఠాయించారు. ఆశాలకు కనీస వే తనం రూ. 18 వేలు ఇచ్చేలా చర్చించాలని కోరారు. –బాలానగర్, జనవరి 10 :

## ముక్కోటి పూజలు



కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 10: తిరుమల తిరుపతి దేవస్థానంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. వైకుంఠ ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యలు పరిష్కరిస్తా



దుండిగల్,జనవరి10: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు శంభీపూర్‌కృష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

జగద్గిరిగుట్ట, జనవరి10: జర్నలిస్టులకోసం ఆదివారం వివేకానందనగర్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్టు కుత్బుల్లాపూర్ టీయూడబ్ల్యూజే కార్యదర్శి సాయిబాబా తెలిపారు. వివేకానందనగర్ బండారు దవాఖానలో కార్డియాలజిస్ట్ సుస్రుత్ పర్యవేక్షణలో ఉద యం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులందరూ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. సాధారణ, గుండె వ్యాధినిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు

మియాపూర్ , జనవరి 10 : వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం రహదారి భద్రతా వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రహదారులు దాటేప్పుడు, వాహనం నడిపేటప్పుడు నిబంధనలను పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమన్నారు. నిబంధనలపై విద్యార్థులు అవగాహన పొంది తల్లిదండ్రులతో పాటు తోటి వారందరిని చైతన్య పరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో సముద్రాల కిరణ్, విజయ వర్ధన్, కు మార్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్,కేటీఆర్‌లను కలిసిన కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ



దుండిగల్,జనవరి10: బీఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన గ్రేటర్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు



దుండిగల్,జనవరి10 : గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దండుగుల స్వామి శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను నగరంలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కవితకు పూలబొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

మియాపూర్ , జనవరి 10 : కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంచర్ అండ్ నేచురోపతి (కాస్మిక్ ) ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత ఆక్యుపంచర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆక్యుపంచర్ విధానంతో శరీరంలోని ముఖ్యమైన ప్రాంతాలలో చేపట్టే ప్రక్రియతో ఎలా ంటి ఆరోగ్య లాభాలుంటాయో వివరించారు. మానసిక ఒత్తిడి తగ్గి చదువుపై మరింత ఏకాగ్రతను పెంపొందించుకునేలా ఈ వైద్య విధానాన్ని ఆచరించాలని, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చునని డాక్టర్ మా ధవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన బృందాన్ని జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వప్న, శ్రీలత, మాధవి, అనూష, శాలిని , రుణశ్రీ, క్రిస్టబెల్, వర్షిత, రజినీ,శశిరేఖ, సుప్రియ, చిద్విలాస్ తదితరులు పాల్గొన్నారు. 60 మందికి పైగా విద్యార్థులకు ఆక్యుపంచర్ ద్వారా వైద్య సేవలను అందించారు.



సిబ్బందిని సన్మానించిన పాఠశాల బృందం

## రెండ్రోజుల పాటు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ పరీక్షలు

కంటోన్మెంట్, జనవరి 10: ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్‌లోని లయన్స్ క్లబ్ దవాఖానలో ఈ నెల 17, 18 తేదీల్లో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ముచ్చా రాంరెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ ప్రతినిధి విద్యాభూషణ్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సెక్రటరీ సందీప్ హరి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గ్రహణం మొర్రి, గ్రహణం అంగులీకం, కాలిన గాయాలతో బాధ పడేవారికి, చేతులు, వాటి వేళ్లు, గొంతు అతుక్కొని ఉన్న వారికి ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు.

## ఇంటికి పార్కింగ్ స్థలం తప్పనిసరి



మార్కింగ్ చేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

అల్లాపూర్,జనవరి10: బహుళ అంతస్తులు కట్టుకునేవారు వాహనాలను నిలిపేందుకు తగిన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకొని ఇల్లు నిర్మించుకోవాలని అవంతీనగర్ సం క్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు నిర్మాణ దారులను కో రారు. మోతీనగర్ పరిధి అవంతీనగర్ తోట కాలనీలో రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసి సమస్యలు సృష్టిస్తున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు అంబులెన్స్ కూడా తిరగలేని పరిస్థితి ఉన్నదని కాలనీవాసులు వాపోతున్నారన్నారు. కాలనీ సంక్షేమ సంఘం లోతుగా చర్చించి ఓ నిర్ణయానికి వచ్చిందని తెలిపారు. కాలనీలో ఉన్న రోడ్లకు తగ్గట్టు ఇరువైపులా లైన్ మార్కింగ్ వేసి అందులోనే వాహనాలు పార్కింగ్ చేసుకోవాలంటూ ఈ మేరకు కాలనీ సభ్యులు ఏకపక్షంగా తీర్మానించారు. శుక్రవారం కాలనీలో పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు తీయించి, ప్రతి వీధిలో రోడ్డు ఇరువైపులా పసుపు రంగు లైన్ గీయించి అందులోనే కాలనీవాసుల వాహనాలు నిలుపాలని సూచించారు. ఈ కాలనీని ఆదర్శంగా తీసుకుని ముమ్ముందు మరిన్ని కాలనీలు ముందుకు వచ్చి అక్రమ పార్కింగ్ సమస్యను అరికట్టాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి సత్యనారాయణ స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



కొండాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన స్ట్రోక్స్ ఆఫ్ నేచర్ –2 పెయింటింగ్స్ అండ్ స్కల్ప్చర్స్ ప్రదర్శనను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గంగాధర్, అలేఖ్య హోమ్స్ సీఈఓ అండ్ ఎండీ శ్రీనాథ్ కుర్రెలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలను తిలకించారు. కళాకారులు ఆకుల రఘు, అక్కిరాజు రమణలు వేసిన 70 చిత్రాలను ఈ నెల 12వ తేదీ వరకు ప్రదర్శించనున్నారు.

## అలరించిన భరతనాట్య నృత్య ప్రదర్శన



కొండాపూర్, జనవరి 10 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గాంధీ శిల్ప బజార్, సంక్రాంతి సంబురాలలో భాగంగా శుక్రవారం పలువురు నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇందులోభాగంగా బెంగుళూరుకు చెందిన నృత్య నూపుర స్కూల్ ఆఫ్ డాన్స్ గురువులు మైథిలి దీపాల తన శిష్య బృందంతో కలిసి ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు అలరించాయి. గణపతి తాళం, శివ తాండవ స్తోత్రం, మధురాష్టకం, అయిగిరినందిని, భజమానస, కావడి చిందు, ముద్దుగారే యశోద, ఏడుపంబె, అర్ధనారీశ్వర స్తోత్రం అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.



## సంక్రాంతి సంబురాలు

దుండిగల్,జనవరి10: దుండిగల్‌లోని మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల (ఎంఎల్‌ఆర్ఐటీ)లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. కళాశాలకు చెందిన కేమ్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు అధ్యాపకులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లులు,గొబ్బెమ్మల ఏర్పాటుతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణం సంతరించుకుంది. హరిదాసులు సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

## మురిపెంగా ముగ్గుల పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 10: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో సాంస్కృతిక విభాగం, మహిళ సాధికారికరత విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, పద్మ, లక్ష్మయ్య, శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుని, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థినులు అందమైన ముగ్గులు, రంగులతో వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయని, చదువులతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కన్వీనర్ మంజుల,అధ్యాపకులు వేణు, హిమబిందు, సౌజన్య, కవిత, దీప్తి, శారద, గణేశ్, అశ్వినికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొని ముగ్గులను వేశారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్‌రెడ్డి , వెంకటేశ్వర్‌రావులు బహుమతులను అందించారు.







కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేసిన విద్యార్థినులు



ఆల్విన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, జనవరి 10: మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ రూ. 4 కోట్ల 4 లక్షల 20 వేల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. గోకుల్ ప్లాట్స్ కాలనీలో రూ. 93.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, ఇజ్జత్ నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో రూ. 25 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, సాయి నగర్ కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపనలు చేసిన అనంతరం కాకతీయ హిల్స్ కాలనీలో రూ. 16.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, నవ భారత్ నగర్ కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, యశోద హాస్పిటల్ వద్ద రూ. 46 లక్షల వ్యయంతో ఆర్‌సీసీ బాక్స్ కల్వర్టు నిర్మాణం, ఆదిత్యా నగర్ కాలనీలో రూ. 18 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, మాతృశ్రీ నగర్ కాలనీ రూ. 33 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో దవాఖాన నిర్మించండి



మంత్రి రాజనర్సింహకు వినతి పత్రం అందజేసిన నాయకులు

జగద్గిరిగుట్ట, జనవరి10: పేదలు ఎక్కువగా ఉన్న జగద్గిరిగుట్టలో ప్రభుత్వ దవాఖానను నిర్మించాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. శుక్రవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. గతంలో గురుకుల పాఠశాల తరలిపోయిందని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఐలయ్య, జనార్దన్, హుస్సేన్, కమల్ కిశోర్ ఉన్నారు.

## ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



ఆధ్యాత్మికతతో జగద్గిరిగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పలువురు నేతలు కోరారు. చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌చారి, బుచ్చిరెడ్డి, రాజు, సునీత, వేణుగౌడ్‌లను శుక్రవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ సన్మానించారు. శ్రీకాంతాచార్యులు, రాజుయాదవ్, శ్రీకాంత్ యాదవ్ ఉన్నారు. –జగద్గిరిగుట్ట, జనవరి10:

## పండుగకు ఊరెళ్తున్నారా జాగ్రత్త

మియాపూర్ , జనవరి 10: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మియాపూర్ సీఐ క్రాంతి సూచించారు. అవగాహన నిమిత్తం ఆటో ద్వారా కాలనీలలో మైకు ద్వారా నిర్వహిస్తున్నా ప్రచారాన్ని శుక్రవారం సాయంత్రం సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతి మాట్లాడుతూ విలువైన వస్తువులు, నగదును ఇండ్లల్లో పెట్టవద్దని, బ్యాంకు లాకర్లలో భద్ర పరుచుకోవాలన్నారు. బీరువా తాళం చెవులు సులువుగా గుర్తించేలా అందుబాటులో ఉంచవద్దని, ప్రత్యేకంగా భద్రపరచాలని సీఐ తెలిపారు. ఆయా కాలనీలలో పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని , ఊరెళ్లే వారు పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందించి వెళ్లటం మంచిదన్నారు. ఈ సందర్భంగా మియాపూర్ ఠాణా పరిధిలో రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



జగద్గిరిగుట్ట సమీపంలోని పరికిచెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు శుక్రవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గాజులరామారం, ఆల్విన్ కాలనీల వైపు ఉన్న ప్రాంతంల్లో కబ్జాలు జరిగాయని తెలిపారు. గాజులరామారం డివిజన్ మహదేవపురం వద్ద ఓ నిర్మాణ సంస్థ భూ ఆక్రమణలకు పాల్పడిందన్నారు. జగద్గిరిగుట్ట భూదేహిల్స్‌లో చెరువు పూడ్చి ఓ వ్యక్తి స్థలాలు విక్రయిన్నారని ఫిర్యాదు చేశారు. సుమారు 10 ఎకరాల మేర కబ్జా జరిగిందని ప్రస్తావించారు. పరిశీలన చేపట్టి ఆక్రమణలు తొలగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నేతలు ఉమామహేశ్, హరినాథ్, ప్రవీణ్, మహేందర్, ప్రభాకర్, సోమన్న పాల్గొన్నారు. – జగద్గిరిగుట్ట, జనవరి10:

## వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలి

దుండిగల్,జనవరి10: మున్సిపాలిటీ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేయడమే లక్ష్యంగా బిల్ కలెక్టర్లు, సిబ్బంది పని చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు సూచించారు. శుక్రవారం ఆస్తిపన్ను వసూలు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను కలెక్షన్ వంద శాతం పూర్తి చేయాలని,అండర్ అసెస్మెంట్, ఆన్ అసెస్మెంట్, కమర్షియల్ ప్రాపర్టీస్‌ను గుర్తించి పన్నులు విధించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్‌తో పాటు పలువురు బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

**ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుదారులను గుర్తించాలి..**

మున్సిపాలిటీ పరిధిలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరిని ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా గుర్తించి వాళ్లు అప్లై చేసుకున్న స్థలాలను పరిశీలించి వాటిని జీఐఎస్ సర్వేలో తీసుకొని, మొదట చెల్లించిన వెయ్యి రూపాయలు మినహాయించి మిగిలిన బ్యాలెన్స్ అమౌంట్ ఎంత చెల్లించాలో నోటీస్ ద్వారా చేరవేయాలన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు